## రోడ్డు నిర్మాణం.. ఇంకెప్పుడు పూర్తి చేస్తరు?

జంగపల్లిలో డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ధర్నా చేస్తున్న గ్రామస్తులు

గన్నేరువరం, మార్చి 31: మండలంలోని గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా ఇల్లంతకుంట మండలం పొత్తూరు వరకు చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని సోమవారం మండలంలోని జంగపల్లిలో గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గునుకుల కొండాపూర్ నుంచి జంగపల్లి వరకు కంకర పోసి నిర్లక్ష్యంగా వదిలేయడంతో రైతులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో పూర్తి చేస్తానన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలు పరిష్కరించాల్సిన ఎమ్మెల్యే ముఖం చాటేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. డబుల్ రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని, లేకపోతే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అటీకం శ్రీనివాస్ గౌడ్, తాడూరి వెంకటరమణారెడ్డి,అటికం రవి, మహంకాళి ప్రభాకర్, రామచంద్రం గౌడ్, ఆంజనేయులు, తాడూరి వంశీకృష్ణారెడ్డి, సందీప్, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ అందించి.. మోటర్లు కాపాడండి

ఏఈకి వినతి పత్రం అందిస్తున్న రైతులు

కరీంనగర్ రూరల్, మార్చి 31: ఓల్టేజీ కంటే తక్కువ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లతో వ్యవసాయ మోటర్లు కాలిపోతున్నాయని బొమ్మకల్ గ్రామంలోని గుంటూర్‌పల్లి సన్నకారు, కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ మోటర్లకు సరిపడా ఓల్టేజీతో విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం బొమ్మకల్ విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గడ్డి సంతోష్, పిల్లి కొమురయ్య, చీటి శ్రీనివాస్, మంద తిరుపతి, పిల్లి రమేశ్‌యాదవ్, పుట్టపాక శ్రీధర్, సాయవేణి శ్రీనివాస్, నాయిని రాము, సాయవేణి రవీందర్, సాయవేణి లింగయ్య తదితరులు ఉన్నారు.

## యువకుడిపై కత్తితో దాడి

చిగురుమామిడి, మార్చి 31: వ్యక్తిగత కక్షలతో యువకుడిని కత్తితో పొడిచిన ఘటన మండలంలోని గునుకుల పల్లె గ్రామంలో చోటుచేసుకున్నది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గునుకుల పల్లె గ్రామంలో బరిగెల శ్రీనివాస్ అతడి భార్య ఇద్దరూ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరి ఇంటి సమీపంలో ఉన్న గునుకుల హరికృష్ణారెడ్డి 20 రోజుల క్రితం శ్రీనివాస్ ఇంటి వద్ద లేని సమయంలో అతడి భార్యపై లైంగికదాడికి యత్నించడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనపై కేసు పెడతావా అని హరికృష్ణారెడ్డి కక్ష పెంచుకొని సోమవారం పొలం వద్ద ఉన్న శ్రీనివాస్‌పై కత్తితో దాడి చేశాడు. కడుపులో ఎడమ వైపు పొడిచాడు. శ్రీనివాస్ రోడ్డుపై పరిగెత్తుకుంటూ వచ్చి పెట్రోల్ బంక్ చౌరస్తా వద్ద అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు డయల్ 100కు కాల్ చేశారు. 108 వాహనంలో కరీంనగర్ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని ఎస్సై రాజేశ్ పరిశీలించారు. అనంతరం హాస్పిటల్‌లో ఉన్న శ్రీనివాస్‌ను వివరాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

## లింగాపూర్ రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

ఎన్నారపు రాంరెడ్డి

శంకరపట్నం, మార్చి 31: మండలంలోని లింగాపూర్ గ్రామంలో రెడ్డి సంఘం 7వ వార్షిక మహాసభ రావుల రాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్నారపు రాంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా అంతం రాజిరెడ్డి, పాలకవర్గ సభ్యులుగా అంతం వాసుదేవారెడ్డి, అంతం మధూకర్‌రెడ్డి, గూడ ధర్మారెడ్డి, గాజుల మల్లారెడ్డి, రావుల రాంరెడ్డి, అంతం ప్రతాపరెడ్డి, అంతం రాజిరెడ్డి, ఎన్నారు రాజిరెడ్డి, తడిసిన నారాయణరెడ్డి ఎన్నికయ్యారు.

# నిధులివ్వకుండా.. నిర్వహణేలా?

నర్సరీలో పెంచుతున్న మొక్కలు

- పెండింగ్‌లో నర్సరీల కంపోనెంట్ నిధులు
- వనమహోత్సవానికి మొక్కల సిద్ధం కోసం ఆదేశాలు
- ప్రభుత్వ తీరుపై నిర్వాహకుల్లో ఆందోళన

కలెక్టరేట్, మార్చి 31: నర్సరీల నిర్వహణకు నిధులు విడుదల చేయకుండానే, వర్షాకాలంలో చేపట్టబోయే వనమహోత్సవానికి మొక్కలు పెంచాలని ఒత్తిడి తెస్తుండడంపై నర్సరీల నిర్వాహకుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. గతేడాది నిధులే పూర్తిగా చెల్లించకుండా, తిరిగి మళ్లీ కొత్త మొక్కల పెంపకానికి ఆదేశాలు వెలువరిస్తుండడంపై మండిపడుతున్నారు. ఏనెలకు ఆనెల అందించాల్సి ఉండగా, నెలల తరబడి పెండింగులో పెట్టడంతో, మెయింటెనెన్స్ కోసం తెచ్చిన అప్పులు తీర్చేందుకు సతమతమవుతున్నా, ఏమాత్రం పట్టించుకోకుండా తాము చెప్పినట్లు చేయాల్సిందేనంటూ హుకూం జారీ చేస్తుండడంతో వారి నుంచి తీవ్ర అసహనం వ్యక్తమవుతున్నది.

వర్షాకాలంలో చేపట్టబోయే వనమహోత్సవానికి అవసరమైన మొక్కలు గ్రామపంచాయతీల్లో నర్సరీల ద్వారా పెంచుతున్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్వహిస్తున్న వీటిలో మొక్కలు సిద్ధం చేసేందుకు అవసరమైన ముడి సరుకుకు మెటీరియల్ కాంపోనెంట్ కింద ముందుగానే నిధులు విడుదల చేయాల్సి ఉంటుంది. ఏటా జనవరి, ఫిబ్రవరి మాసాల్లోనే ప్రణాళికలు తయారు చేసి నాటబోయే మొక్కలకు సంబంధించిన విత్తనాలు సిద్ధం చేస్తారు. ఇందుకోసం అవసరమైన మట్టి, విత్తనాలు, ప్లాస్టిక్ కవర్లు, ఇతరత్రా సామగ్రికి రూ.15వేల వరకు అందజేస్తారు. ఉపాధి కూలీలకు చేస్తున్న చెల్లింపులతో పాటే, నర్సరీల్లో పని చేస్తున్న వారికి కూడా వేతనం విడుదల చేస్తున్నారు. ఈ నిధులు మాత్రం పెండింగ్‌లో పెడుతున్నారు.

### ఇచ్చేవి అత్తెసరు నిధులు.. ఆపై బకాయిలు

జిల్లాలో మొత్తం 308 నర్సరీలు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్క దాంట్లో 10 నుంచి 15 వేల వరకు మొక్కలు పెంచుతున్నారు. గతేడాది పెంచిన మొక్కలు కొన్ని మిగిలిపోగా, ఈసారి లక్ష్యాన్ని తగ్గించినట్లు తెలుస్తున్నది. మొక్కలు దృఢంగా పెరిగే క్రమంలో విత్తన అభివృద్ధి కోసం అవసరమైన పోషకాలు కలిగిన మట్టి, చీడపీడల నివారణ కోసం వినియోగించుకునేందుకు అవసరమైన మందులకు కూడా ప్రభుత్వం విడుదల చేసే కాంపోనెంట్ నిధులు సరిపోవడం లేదు. అయినా, కింద మీద పడి నర్సరీలు నిర్వహిస్తుంటే పాత చెల్లింపులు చేయకుండానే తిరిగి కొత్తగా మొక్కలు పెంచాలంటూ ఆదేశించడం ఏమేరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్థలాల్లో నర్సరీలు నిర్వహిస్తున్నచోట గ్రామ పంచాయతీలు బాధ్యత వహిస్తుండగా, మిగిలినచోట్ల ప్రైవేటు వ్యక్తులు కొనసాగిస్తున్నారు. వీరికి మెటీరియల్ కాంపోనెంట్ కింద ఒక్కొక్క నర్సరీకి నెలకు రూ.15వేల దాకా బకాయిపడ్డట్లు తెలుస్తున్నది. గత కొద్ది నెలలుగా ఈ నిధులు రాకపోవడంతో తాము అప్పులపాలవుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమను కరుణించి పెండింగ్ నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

## ఆర్‌వైవీ పథకానికి అర్హులైన యువతకు ఉపాధి అవకాశాలు

కలెక్టరేట్, మార్చి 31: రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ తెలిపారు. జిల్లాలో ఈ పథకం అమలుకు చేపట్టాల్సిన చర్యలపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం రాత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, ఇప్పటికే ఆయా శాఖల ద్వారా పలుమార్లు పత్రికా ప్రకటనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామీణ స్థాయిలో రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేలా యువతను ప్రోత్సహించేలా అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా లబ్ధిపొందేందుకు వచ్చిన దరఖాస్తుల వివరాలు అధికారులకు ఆమె వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డీటీడీవో పవన్‌కుమార్, డీఆర్‌డీవో శ్రీధర్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## లక్నోలో తాడిజెర్రి ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శన

ఒగ్గుకళను ప్రదర్శిస్తున్న కళాకారులు

గంగాధర, మార్చి 31: తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, లక్నో తెలుగు అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నోలో ఆదివారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో మండలంలోని తాడిజెర్రి గ్రామ మల్లికార్జున ఒగ్గుకళా సేవా సమితి కళాకారులు ఒగ్గుడోలు కళను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఐఏఎస్‌లు రవీందర్‌నాయక్, గురు ప్రసాద్, లక్నో తెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు డీఎన్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర కళా రూపమైన ఒగ్గుకళను జాతీయ స్థాయికి తీసుకువెళ్లిన తాడిజెర్రి ఒగ్గుకళ సేవా సమితి సభ్యులను అభినందించారు. అనంతరం కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో కళాకారులు ఈర్ల మహిపాల్, గుంట మహేందర్, ఈర్ల గణేశ్, గడ్డం రాము, మేక ప్రశాంత్, నాగం మొగ్గయ్య, పోలె అనిల్, పోలె శ్రీకాంత్, బండారి విజయ్, పోలె శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ బయలుదేరిన బీసీ నాయకులు

తెలంగాణచౌక్, మార్చి 31: ఈ నెల 2 ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన చేపట్టిన బీసీ పోరు గర్జనలో పాల్గొనేందుకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కనకయ్య, ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడూరి పరశురాంగౌడ్, జీఎస్ ఆనంద్ తోపాటు ముఖ్యనాయకులు సోమవారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, కులగణన, పెండింగ్‌లో ఉన్న బీసీ మహిళా రిజర్వేషన్ల బిల్లులను ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని నాయకులు తెలిపారు. కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్రంలో ఎంపీల పర్యటనలు అడ్డుకుంటామని హెచ్చరించారు.

## భూములు కాజేయాలని చూస్తే ఊరుకోం

శాతవాహన యూనివర్సిటీ గేట్ వద్ద వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కమాన్‌చౌరస్తా, మార్చి 31: హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏబీవీపీ శాతవాహన యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో యూనివర్సిటీ గేట్ వద్ద నిరసన తెలిపి, ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. వెంటనే ఆ భూములను యూనివర్సిటీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కరీంనగర్ జిల్లా కన్వీనర్ పూసల విష్ణు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులు చదువుకునే యూనివర్సిటీలపై కక్ష కట్టిందని మండిపడ్డారు. వాటి భూములను కాజేయాలని చూస్తే ఊరుకోబోమన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్షుడు బాలకృష్ణ, నగర కార్యదర్శి నందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విఘ్నేశ్, జోనల్ ఇన్‌చార్జిలు విష్ణు, యోగేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## నగర ప్రజలు పన్నులు చెల్లించి సహకరించాలి

కార్పొరేషన్, మార్చి 31: కరీంనగర్ నగరపాలక సంస్థకు ఆస్తి పన్నుల బకాయిలు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కోరారు. ఆస్తి పన్నుల వసూళ్లలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయం రెవెన్యూ విభాగంలో సోమవారం ఉదయం ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. 15 మంది ఉద్యోగులను కాల్ సెంటర్‌లో నియమించి, వారితో బకాయిదారులకు ఫోన్ చేయించి సమాచారం అందించారు. 2024-2025 ఆర్థిక సంవత్సరం సోమవారంతో ముగుస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 90 శాతం వడ్డీ మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాత్రి 12 గంటల వరకు కూడా నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు తెరిచి ఉంటాయని తెలిపారు. ఇప్పటికే నోటీసులు ఇచ్చినా పన్నులు చెల్లించని బకాయిదారుల దుకాణాలకు తాళం వేసి సీజ్ చేశారు. కరీంనగర్‌లో కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రెవెన్యూ గార్డెన్ అద్దె దుకాణాలకు అధికారులు తాళాలు వేసి సీజ్ చేశారు. నగరపాలక సంస్థ మొత్తం ఆస్తి పన్ను డిమాండ్ రూ.52 కోట్లు కాగా, చివరి రోజు రాత్రి 8 గంటల వరకు 39 కోట్ల 27 లక్షల రూపాయలు వసూలయ్యాయని అధికారులు వెల్లడించారు.

### చివరి రోజు కోటిన్నర వసూలు.. పలు ఆస్తుల సీజ్

ఆర్థిక సంవత్సరం ముగింపు రోజు సోమవారం సాయంత్రం ఏడున్నర గంటల వరకు కరీంనగర్ నగరపాలక సంస్థకు రూ.కోటిన్నర పన్నులు వసూలయ్యాయని అధికార వర్గాలు తెలిపాయి. మొండి బకాయి దారులపై చివరి రోజు కూడా నగరపాలక సంస్థ అధికారులు కొరడా ఝుళిపించారు. ఇందులో భాగంగా రెవెన్యూ క్లబ్‌కు సంబంధించిన 35 షెట్టర్లను సీజ్ చేశారు. అలాగే నగరంలోని పలు మొండి బకాయిదారుల ఆస్తులను సీజ్ చేసినట్లు ఆర్వో భూమానందం తెలిపారు.

## ఆర్టీసీ ఈడీ ఖుస్రోషాఖాన్ బదిలీ

తెలంగాణచౌక్, మార్చి 31: ఆర్టీసీ కరీంనగర్ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషాఖాన్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆదిలాబాద్ ఆర్ఎం సోలోమాన్ కరీంనగర్ జోనల్ ఈడీగా బదిలీపై రానున్నారు. ఈ మేరకు సంస్థ వైస్ ప్రెసిడెంట్, ఎండీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఉద్యోగ విరమణ సన్మానం

విద్యానగర్, మార్చి 31 : కరీంనగర్ కమిషనరేట్‌లోని సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ వీరయ్య ఉద్యోగ విరమణ పొందగా, సీసీఎస్ అధికారులు, తోటి ఉద్యోగులు సోమవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సీసీఎస్ ఏసీపీ కాశయ్య, ఏఎస్ఐ వీరయ్యకు పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఎస్సైలు శేఖర్, నాగరాజు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముకరంపుర, మార్చి 31: నగరంలోని టౌన్-8 సెక్షన్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి సోమవారం ఉద్యోగ విరమణ పొందిన కాంతల ఇంద్ర సేనారెడ్డిని తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. సంస్థ వాహనంలోనే ఇంటికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో టౌన్ -1 ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్, ఎస్ఎల్ఐ టీ మహేందర్ రావు, లైన్ మెన్‌లు ప్రకాశ్, రవీందర్, సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రూప్-1 టాపర్‌కు..

కన్నం హరిణిని సన్మానిస్తున్న శ్రీరాంనగర్ కాలనీ వాసులు

విద్యానగర్, మార్చి 31 : నగరంలోని శ్రీరాంనగర్‌కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు కన్నం రమేశ్, కళా ప్రపూర్ణ జ్యోతి కూతురు కన్నం హరిణి గ్రూప్-1లో రాష్ట్ర స్థాయిలో 55వ ర్యాంకు, ఎస్సీ కమ్యూనిటీలో మొదటి ర్యాంకు సాధించగా, సోమవారం వరసిద్ధి వినాయక మందిరం కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీవాసులు నాయిని అంజయ్య, ఉప్పుగండ్ల ఇంద్రసేనారెడ్డి, ఎన్నం శ్రీనివాస్, గంగాధర్, వరాల నర్సింగం, కొత్త శంకరయ్య, అందె శ్యాం, పుల్లోజు రమేశ్, ఉప్పు జలపతి, రామన్, రాజయ్య, రమన్, శరత్, భూంరెడ్డి, మల్లేశం, శ్రీధర్ పాల్గొన్నారు.

## పిచ్చి కుక్క దాడిలో గేదె మృతి

చిగురుమామిడి, మార్చి 31: సీతారాంపూర్ గ్రామంలో పిచ్చి కుక్క దాడిలో గేదె మృతిచెందింది. నాలుగు రోజుల క్రితం పిచ్చి కుక్క దాడి చేయగా, తీవ్ర అస్వస్థతకు గురై ఆదివారం రాత్రి మృత్యువాత పడింది. గేదె రూ.1.20 లక్షల విలువ చేస్తుందని, దానిపై ఆధారపడి జీవిస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని యజమానులు మెరుగు రాజేశం- స్వరూప దంపతులు కోరారు.

## చాంపియన్స్ కరాటే అకాడమీలో కరాటే బెల్ట్ ప్రదానం

కరాటే బెల్ట్‌లు సాధించిన చాంపియన్స్ కరాటే అకాడమీకి చెందిన క్రీడాకారులు

కొత్తపల్లి, మార్చి 31 : కరీంనగర్‌లోని చాంపియన్స్ కరాటే అకాడమీకి చెందిన పలువురు విద్యార్థులు సోమవారం జరిగిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్, సెమినార్‌లో అద్భుత ప్రతిభ చూపి పలు విభాగాల్లో బెల్ట్‌లు సాధించినట్లు అకాడమీ తెలంగాణ స్టైల్ చీఫ్ ప్రసన్నకృష్ణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో దమ్మికా కాయి నేషనల్ ప్రెసిడెంట్ షీహాన్ రజనీష్ చౌదరి ఆధ్వర్యంలో జరిగిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్, సెమినార్‌లో చాంపియన్స్ కరాటే అకాడమీకి చెందిన కరాటే విద్యార్థులు సత్తాచాటి ఎల్లో బెల్ట్ నుంచి బ్లాక్ బెల్ట్‌లు కైవసం చేసుకున్నారు. వీరిని నగరానికి చెందిన పలు క్రీడా సంఘాల బాధ్యులు అభినందించారు.

## బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం

ఇల్లందకుంట, మార్చి 31: మండల కేంద్రంలో ఈ నెల 4 నుంచి 16 వరకు జరిగే సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను సోమవారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌లో ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఈవో సుధాకర్‌కు సూచించారు.

## అధికారిని కలిసిన టీఎన్జీవో నాయకులు

కొత్తపల్లి, మార్చి 31 : రోడ్లు భవనాల శాఖలో కరీంనగర్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఇంజినీర్ బీ లక్ష్మణ్‌కు ప్రభుత్వం భవనాల శాఖ క్వాలిటీ కంట్రోల్, రూరల్ రోడ్స్ చీఫ్ ఇంజినీర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించగా, ఆయనను టీఎన్జీవో నాయకులు అభినందించారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు రాజేశ్ భరద్వాజ్, ఆఫీస్ సూపరింటెండెంట్ మారోజు రఘు, టీఎన్జీవోల సంఘం ఉపాధ్యక్షుడు నకిర్తి కరుణాకర్, టెక్నికల్ ఆఫీసర్ వంగూరి ప్రవీణ్, సీనియర్ అసిస్టెంట్ పీఎన్ రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణలపై విచారణ జరిపించాలి

తెలంగాణచౌక్, మార్చి 31: నగరంలోని సిరిపురం కాలనీ మెయిన్ రోడ్ ఆనుకొని ఉన్న సర్వే నంబర్ వందలో భూ ఆక్రమణలపై అధికారులు విచారణ జరిపించాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సర్వే నంబర్లపై విచారణ జరిపించాలని కాలనీ వాసులు చేస్తున్న నిరసన శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాలనీలో విలువైన భూములను కబ్జాదారులు ఆక్రమించుకుంటూ స్థానికుల మీద దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. కాలనీ వాసులకు సీపీఐ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు, నాయకులు పాల్గొన్నారు.

## పట్టణంలో రెండు దుకాణాల్లో చోరీ

ఎల్క్ట్రిక్ షాపులో వివరాలు సేకరిస్తున్న టౌన్ సీఐ తిరుమల్ గౌడ్

హుజూరాబాద్, మార్చి 31: పట్టణంలో ఆదివారం రాత్రి రెండు చోట్ల దొంగతనం జరిగింది. వివరాలు ఇవి.. పట్టణంలోని సైదాపూర్ చౌరస్తా వద్ద గల రాఘవేంద్ర కిరాణా దుకాణంలో, పాపారావు బొంద వద్ద గల ఎలక్ట్రికల్ షాపులో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కిరాణా షాపులో రూ. 30వేల నగదు, ఎలక్ట్రికల్ షాప్ లో రూ. 25 వేల నగదుతో పాటు పావు కిలో వెండి దొంగలు ఎత్తుకెళ్లారు. అర్ధరాత్రి దాటిన తర్వాత షెట్టర్ల తాళాలు పగలగొట్టి దొంగతనం చేశారు. మొదట సైదాపూర్ చౌరస్తాలో, ఆ తర్వాత ఎల్క్ట్రికల్ షాపులో చోరీ జరిగినట్లు పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించి నిర్ధారించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేటి నుంచి చిరుతల యక్షగాన నాటక ప్రదర్శన

కరీంనగర్ రూరల్, మార్చి 31: గోపాల్‌పూర్ గ్రామంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు చిరుతల యక్షగాన నాటక ప్రదర్శన శ్రీనివాస కళానాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నాట్య మండలి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. గోపాల్‌పూర్‌లో గీతామందిరం ఎదురుగా రాత్రి 8 గంటల నుంచి మహాభారతంలోని వివిధ ఘట్టాలను ప్రదర్శిస్తామని, గ్రామస్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## పల్లెల్లో పడకేసిన పాలన

కరీంనగర్ రూరల్, మార్చి 31: ప్రత్యేకాధికారుల పాలనలో పల్లెల్లో పాలనపడకేసింది. కనీస వసతులు కరువవడంతో గ్రామీణ ప్రజానీకం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. మండలంలోని ఎలభోతారం, చెర్లభూత్కూర్ గ్రామాల్లో నెల రోజులుగా వీధి దీపాలు వెలుగక, గ్రామాల్లో అంధకారం నెలకొనగా అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారు. చెర్లభూత్కూర్‌లో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళ్లలో దొంగల బెడద మొదలైంది. ఇక నగునూర్ గుట్ట కింద పండుగ వేళ నీటి సరఫరా లేక ఇబ్బందులు పడ్డామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పన్నుల వసూలుపై ఉన్న శ్రద్ధ, వసతుల కల్పనపై లేకుండా పోయిందని మండిపడుతున్నారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామీణులు వేడుకొంటున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★Wanted Sales Executives @ Karimnagar, Unic Chem Technologies to make Best Future in Water Treatment Plants & Chemicals. Ph: 9573244611, raju@unicchem.com
NT-330931

డాక్యుమెంట్స్ పోయినవి

★గండికోట అయిలయ్య S/o. ఉప్పలయ్య, పేరు మీద గల విక్రయ దస్తావేజు నెం. 2727/1997 గలది బోత్తలపల్లి మండి సైదాపూర్‌కు పోతున్న సందర్భంలో పోయినది. ఇది దొరికిన వారు Cell No: 84519 58499 నెంబరుకు సంప్రదించగలరు.
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

గంగాధర: నారాయణపూర్ మాజీ సర్పంచ్ నజీర్‌కు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, బీఆర్ఎస్ నాయకులు